పేద కుటుంబానికి సాయం

జన్నారం : మండల కేంద్రంలో శిథిలావస్థ అటవీ క్వార్టర్లో ఉంటున్న పేద కుటుంబానికి చెందిన చిన్నారులు సంజయ్, సృజనకు దాతలు సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం పేద కుటుంబం వద్దకు వెళ్లి 15రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. తండ్రి మరణించడం, తల్లికి లోకజ్ఞానం లేకపోవడంతో కుటుంబానికి నిలువ నీడ కూడా లేదు. దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీరాములు గంగాధర్, కె.సుధీర్, జలపతి పాల్గొన్నారు.



www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

1

శుక్రవారం 10 ఫిబ్రవరి 2023

రేపు లడ్డూ ప్రసాదం అమ్మకాలకు బహిరంగ వేలం

నవతెలంగాణ-జైపూర్

వేలాల మల్లికార్జున స్వామి దర్శనార్థం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం దేవాలయం పరిధిలో లడ్డూ ప్రసాదం విక్రయించడానికి ఈ నెల 11న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రమేశ్ తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వేలాల మల్లికార్జున సందర్శనార్థం వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యం ఆలయ ప్రాంగణంలో లడ్డూ ప్రసాదంతో పాటు కొబ్బరి కాయలు విక్రయించడానికి వేలంపాట నిర్వహిస్తామన్నారు. లడ్డూ, పులిహోర, ప్రసాదం విక్రయించడానికి రూ.20వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని, కొబ్బరి కాయలు విక్రయించడానికి రూ.10వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఆలయ ప్రాంగణంలో ఉదయం 12 గంటలకు బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు.

బోధనకు దూరం..విద్యార్థులపై భారం..!

- పది రోజులుగా భాషా పండితుల నిరసన
- 9,10 తరగతులకు నిలిచిపోయిన పాఠాలు
- పదోన్నతులు ఇస్తేనే చెబుతామంటున్న పండితులు
- వార్షిక పరీక్షలపై తీవ్ర ప్రభావం

ప్రభుత్వం తాజాగా పదోన్నతుల్లో అవకాశం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ భాషా పండితులు నిరసన బాటపట్టారు. పది రోజులుగా ఉమ్మడి ఉమ్మడి జిల్లాలో భాషా పండితులు భోదనకు దూరంగా ఉంటున్నారు. నిబంధనల ప్రకారం 9, 10 తరగతులకు బోధించే అవసరం తమకు లేదని చెబుతున్నారు. దీంతో వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండటంతో పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు ప్రభుత్వం తమను ఇన్నాండ్లు వెట్టిచాకిరి చేయించి పదోన్నతుల విషయం వచ్చే సరికి విస్మరించిందని భాషా పండితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏండ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వం తమకు న్యాయం చేయడం లేదని మండిపడుతున్నారు. ప్రస్తుతం పదోన్నతులు కల్పించే వరకు దిగొచ్చే పరిస్థితి లేదనే ఖరాఖండిగా చెబుతున్నారు. పండితుల సహాయ నిరాకరణ కారణంగా సర్కారు బడుల్లో చదివే 9, 10వ తరగతి విద్యార్థులు పాఠాలు నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం సైతం ఈ సమస్యపై దృష్టిసారించి పరిష్కరించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



నిరసన వ్యక్తం చేస్తున్న భాషా పండితులు(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం అయిదేండ్ల విరామం అనంతరం ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడుతోంది. ఇప్పటికే అర్హులైన ఉపాధ్యాయులందరూ దరఖాస్తులు చేసుకున్నారు. కానీ గ్రేడ్-2 భాషా పండితులకు మాత్రం పదోన్నతులకు అవకాశం కల్పించకపోవడంతో వారంతా తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 109మంది తెలుగు భాషా పండితులు, 106మంది హిందీ పండితులతో పాటు ఆరుగురు ఉర్దూ, మరో ముగ్గురు మరాఠీ మాధ్యమ పండితులు పనిచేస్తున్నారు. ఈ లెక్కన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 600మంది భాషా పండితులు విధులు నిర్వర్తిస్తున్నారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం వీరు 8వ తరగతి వరకు మాత్రమే బోధన చేయాల్సి ఉంటుంది. కానీ వీరంతా గత 20ఏండ్లుగా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ 9, 10 తరగతులకు కూడా బోధిస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటు పడుతున్నారు. ఇది వరకే ప్రభుత్వం గ్రేడ్-2 భాషా పండితులను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. కానీ తాజా పదోన్నతుల్లో మాత్రం అవకాశం కల్పించకపోవడంతో వారంతా నిరాశకు గురవుతున్నారు. తమది కాని పని తామెందుకు చేయాలని, జాబ్‌చార్ట్ ప్రకారమే విధులు నిర్వర్తిస్తామని నిరసన గళం వినిపిస్తున్నారు.

ఆందోళనలో విద్యార్థులు

ప్రభుత్వం పదోన్నతులకు అవకాశం ఇవ్వలేని కారణంగా భాషా పండితులు బోధనకు దూరంగా ఉండటం విద్యార్థులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న ఈ కీలక తరుణంలో ఆయా మాధ్యమాల పండితులు బోధనకు దూరంగా ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. కిందటేడాది పది ఫలితాల్లో జిల్లా స్థానం మెరుగ్గా లేకపోవడం అనేక మంది విద్యార్థులు పరీక్షల్లో తప్పడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికే సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే.. తాజాగా భాషా పండితులు కూడా బోధించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ఉపాధ్యాయులు రోజూ విధులకు హాజరవుతున్నా 9, 10 తరగతి విద్యార్థులకు బోధించకపోవడం..కీలకమైన ఈ సమయంలో వారు బోధనకు దూరంగా ఉండటం పదో తరగతి ఫలితాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పదోన్నతులు ఇచ్చేవరకు పోరాటం : వివేక్ భవానీ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, జిల్లా అధ్యక్షుడు



ప్రభుత్వం భాషా పండితులకు పదోన్నతులకు అవకాశం కల్పించాలి. అనేక ఏండ్ల నుంచి తమ విధులు కానప్పటికీ 9, 10 తరగతులకు బోధిస్తున్నాం. కానీ ప్రభుత్వం తమ సేవలను గుర్తించకుండా పదోన్నతుల్లో అవకాశం కల్పించలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ తాము 9, 10 తరగతులకు బోధించకూడదని నిర్ణయించాం. ప్రభుత్వం సమస్య పరిష్కరించే వరకు నిరసన తెలియజేస్తాం.

కౌన్సెలింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి యాజమాన్యం జూనియర్ అసిస్టెంట్ల భర్తీలో కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా సీఐటీయూ ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలుకు ఏరియా జూనియర్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడుతూ కౌన్సెలింగ్ విషయంలో చేస్తున్న న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. యాజమాన్యం అవసరం నిమిత్తం ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్‌గా పరీక్ష నిర్వహించి కౌన్సెలింగ్ కోసం సీనియర్‌ల నుండి అప్లికేషన్లు ఆహ్వానించి ఇంతవరకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టకపోవడం సరైంది కాదన్నారు. సంస్థ వ్యాప్తంగా ఎన్నో ఖాళీలు ఉండగా కేవలం 50 శాతం మందికి మాత్రమే కౌన్సెలింగ్ అర్హత కల్పించడం గతంలో ఎన్నడూ లేదని, వెంటనే యాజమాన్యం పాత పద్ధతి ప్రకారమే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారి స్వస్థలాల్లో భార్య, పిల్లలను వదిలిపెట్టి దూర ప్రాంతం నుండి వచ్చి ఉద్యోగాలు చేసే సిబ్బంది ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏదో ఒకరోజు కౌన్సెలింగ్ ద్వారా సొంత స్థలాలకు వెళ్తామనే ఆశతో ఏండ్ల తరబడి నిరీక్షిస్తున్న సిబ్బందికి నిరాశే ఎదురవుతోందని తెలిపారు.

ఎస్ఆర్‌పీ-1 గనిలో ఐఎన్‌టీయూసీ బాయి బాట



నవతెలంగాణ-నస్పూర్

బాయి బాట కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్రావు ఆధ్వర్యంలో ఐఎన్టియుసి నాయకులు గురువారం ఎస్ఆర్పి1 గనిని సందర్శించారు. డిపార్ట్మెంట్ల వారిగా కార్మికులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులను మొదటి షిఫ్ట్‌లో క్యాంటీన్లో టిఫిన్లు కూడా చేయకుండా శ్రమదానం పేరుతో పెట్టి చాకిరి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల ఇన్కమ్ టాక్స్ కేవలం నూతనంగా చేరిన కార్మికులకు మినహా అందరికీ అన్యాయం జరిగిందని, పాత విధానంలో కార్మికులు ఇన్కమ్ టాక్స్ కట్టాల్సి వస్తుందని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు అనుకూలంగా లేదని పేర్కొన్నారు. ప్రైవేటు గనులను ఐఎన్టీయూసీ వ్యతిరేకిస్తుందని, సెక్రటరీ జనరల్ జనప్రసాద్ నాయకత్వంలో అన్ని యూనియన్లను కలుపుకొని అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగె స్వామి, ఏరియా సెక్రెటరీ సమ్ము రాజయ్య కేంద్ర కమిటీ నాయకులు వెంకటేష్, కుమారస్వామి, తిరుపతి, జీవన్‌రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం

మైనారిటీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఫసిఉల్లా అన్నారు. గురువారం మైనారిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా వెనకబడ్డ మైనార్టీలు దాదాపు 100 మంది రుణాలకు దరఖాస్తు చేసుకుంటే కేవలం ఇద్దరికే మంజూరు చేయడం అన్యాయమన్నారు. మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. మాటల్లో తప్ప చేతల్లో ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటికైనా దరఖాస్తు చేసుకున్న పేద కుటుంబాలందరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనారిటీల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే దళితబంధులాగా మైనారిటీ బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గంగాపూర్ జాతర ఆదాయం రూ.34.67లక్షలు

నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గంగాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర హుండీ ఆదాయం రూ.34.67లక్షలు సమకూరాయని ఈఓ బాపిరెడ్డి తెలిపారు. గురువారం హుండీ డబ్బులు లెక్కించగా రూ.15.13లక్షలు వచ్చినట్టు తెలిపారు. ప్రత్యేక దర్శనం, సులభ దర్శనం, శీఘ్ర దర్శనం, కేశ ఖండనం, కొబ్బరికాయలు, ప్రసాద విక్రయాలు, పార్కింగ్ డబ్బులు రూ.19.54 లక్షలు వచ్చినట్టు వివరించారు. మొత్తం రూ.34.67లక్షల ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

వెదురు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వెదురు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ అన్నారు. బుధవారం శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 200 మంది మేదరి, 200 మంది కొలాం కులస్తులకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మేదరి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల మేదరి సంఘం అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

ఓటరు ఐడీని ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలి

వాంకిడి: ఓటరు ఐడీ కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరు ఐడీకార్డుకు ఆధార్ నెంబర్ లింక్ చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో 6(బి) ఫారం అందుబాటులో ఉందని, మరిన్ని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

- రామగుండం కమిషనర్ రెమా రాజేశ్వరి



నవతెలంగాణ-నస్పూర్

విధి నిర్వహణలో విచక్షణ, విజ్ఞతలతో మానవీయకోణంతో పని చేస్తూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. గురువారం సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌస్‌లో మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్, సర్కిల్, స్టేషన్‌ల వారిగా స్టేషన్ పరిధి ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులు, నేరాలు, ఫ్యాక్టరీలు, సంస్థలు, సమస్యలు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదారుడు ముందుగా స్టేషన్లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌ని కలిసి బాధలు చెప్పుకుంటారని, సామాన్య ప్రజలకు చట్టపరిధిలో ఏ విధంగా న్యాయం చేయగలమో ఆలోచించి దానికి తగ్గట్టుగానే ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. స్టేషన్ పరిధిలో సబ్ ఇన్‌స్పెక్టర్ పనితీరుపై ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. పోలీసులు నిర్వర్తించే ప్రతి పనిని ప్రజలు గమనిస్తారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరికి తమ పని పట్ల నిబద్ధత, బాధ్యత కలిగి ఉండాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో జాప్యం పనికిరాదని, సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యత కూడిన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు, నాకా బందీలు, ఏరియా డామినేషన్, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని, నిరుద్యోగ యువతకు శిక్షణలు ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం, జాబ్ మేళాలు, మెడికల్ క్యాంప్స్ నిర్వహించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ కమ్యూనిటీ పోలీసింగ్, నేను సైతం కార్యక్రమంలో భాగంగా తమ ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా వారిని భాగస్వాములను చేయాలని కోరారు. మంచిర్యాల జోన్ పరిధిలో పోలీస్‌స్టేషన్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, నేరాలు జరగకుండా ముందస్తు కట్టడి, సంఘవిద్రోహశక్తులను అదుపు చేసేందుకు చర్యలు తీసుకొని ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల మన్నల్ని పొందే లాగా పనిచేసి ఉత్తమ పోలీస్‌స్టేషన్‌లుగా ఎంపిక కావాలని తెలిపారు.

ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ నరేందర్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మోహన్, సిసిఎస్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఏసీపీ బాల్ రాజు, బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ మల్లికార్జున్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, భీమేష్, సిసి ఆర్బి ఇన్‌స్పెక్టర్ బాబురావు, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, మంచిర్యాల్ జోన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత లేని కేంద్ర బడ్జెట్

- డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం



నవతెలంగాణ - రెబ్బెన

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత నివ్వలేదని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు చాపిలె పురుషోత్తం మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి చేసిన ప్రసంగం మొత్తంలో దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలకు చాలా తక్కువ ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం గురించి పెద్దగా మాట్లాడలేదన్నారు. ఉపాధిహామీ చట్టంపై ప్రత్యక్ష దాడి చేశారని, చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు కనబడుతోందన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని విస్తరించాలని దేశంలోని యువత డిమాండ్ చేస్తున్న తరుణంలో ప్రభుత్వం అందుకు విరుద్ధంగా నిధులు తగ్గించిందని విమర్శించారు. ఈ బడ్జెట్ ద్వారా ప్రభుత్వం ఆడిన జిమ్మిక్కులను అర్థం చేసుకోవాలని, దేశంలోని పేదలను మరింత పేదలుగా మార్చే మోడీ ప్రభుత్వ విధివిధానాలను ప్రశ్నించాలని యువతను కోరారు. మొత్తం బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు అసలు ప్రాధాన్యత లేదని, క్రీడల అభివృద్ధికి, స్కిల్ డెవలప్‌మెంట్‌కు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. మోడీ హామీ ఇచ్చిన ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన బూటకమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో నిరుద్యోగ యువత బీజేపీ, మోడీని గద్దిదించడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి తిరుపతి, మండల నాయకులు చల్లూరి కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి



నవతెలంగాణ-తాండూర్

అక్రమార్కులు విలువైన ప్రభుత్వ భూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో వాటిని కాపాడాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. మండలంలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రేచిని రోడ్డు రైల్వే స్టేషన్‌ను ఆనుకొని ఉన్న 612 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి, తాండూరు గెస్ట్‌హౌస్, ఊరు రేచిని గ్రామంలోని భూములు, కాసిపేట, బోయపల్లి పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యే అవకాశాలున్నాయని, వెంటనే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల వివరాలను ప్రజలకు తెలిసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పంచాయతీ అధికారులు ఎందుకు అభ్యంతరం చెప్పడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను కాపాడే విధంగా చర్యలు తీసుకోనట్లయితే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కాపర్తి సుభాష్, మాజీ జడ్పీటిసి బండి పోశం, కొలిపాక భాస్కర్, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ మోమిన్ అలీ, షేక్ హైమద్, సిపిఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్ పాల్గొన్నారు.

పత్తి క్వింటల్‌కు రూ.12వేల ధర చెల్లించాలి

- నేటి మహా ధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

పత్తి క్వింటాల్‌కు రూ.12వేలు చెల్లించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు కనీస మద్దతు ధర చెల్లించకపోవడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ధర లేక పెట్టుబడి ఖర్చులు కూడా లభించని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని, లేకపోతే రాబోయే రోజుల్లో రైతాంగాన్ని కదిలించి పెద్ద పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రైతు సమస్యలపై శుక్రవారం నిర్వహించనున్న కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, నాయకులు ప్రేమ్‌కుమార్, మహేందర్, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి రీజినల్ అధ్యక్షులు పాల్గొన్నారు.

చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వేరుశనగ పంట క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



నవతెలంగాణ-జైపూర్

వేరుశనగ పంటను ఆశించే చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాజేశ్వర్ నాయక్ సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక పంట క్షేత్రాల పరిశీలనలో భాగంగా మండల పరిధిలో వేరుశనగ పంట క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పౌనూర్, గోపాల్‌పూర్, గోదావరిపల్లి శివారులో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగలో తిక్క ఆకు మచ్చ తెగులు ఆశించినట్లు గుర్తించిన ఆయన నివారణ చర్యగా లీటరు నీటికి ఒక మిల్లీ లీటర్ టెబుకోనోజోల్ శిలీంద్ర నాశిని పైరు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలని సూచించారు. పంటలను ఆశించే చీడపీడల పట్ల ముందు జాగ్రత్తగా ఉండటంతో పాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సామూహిక క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులకు పంపిణీ చేసిన కదిరి లేపాక్షి రకంలో తెగులు ఉధృతి తక్కువగా ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా గూడలు దిగే సమయంలో సూచించిన మేరకు జిప్సం వాడిన రైతు క్షేత్రంలో గింజల పరిమాణం, నాణ్యత, రంగు మెరుగ్గా ఉన్నట్లు వెల్లడించారు. ఫలితంగా నాణ్యతతో కూడిన దిగుబడి, నూనె శాతం పెరుగుతుందని కోత సమయం తగ్గుతుందని తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా స్థూల, సూక్ష్మ పోషకాల లోపం వలన కలిగే సమస్యలను నివారించుకోవడం తదితర అంశాలపై రైతులతో ప్రత్యక్షంగా చర్చించారు. ఈ సందర్భంగా చెన్నూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాపు మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు పంటల సాగులో గుర్తించిన సమస్యలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి నాణ్యమైన దిగుబడి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి శాస్త్రవేత్తలు శివకృష్ణ, నాగరాజు, మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్‌స్టన్, సర్పంచ్ సారయ్య, ఉప సర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

11న వేలంపాట

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామంలో గల ప్రసన్న పరమేశ్వర శివాలయంలో ఈ నెల 18న జరిగే స్వామి కళ్యాణం, జాతర మహోత్సవం సందర్భంగా ఈ నెల 11న వేలం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్ తెలిపారు. తైబజార్, కొబ్బరికాయలు, సైకిల్‌స్టాండ్, లడ్డూ ప్రసాదం తదితర వాటికి వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు



లింగి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, ఏఎస్సై గణపతి గురువారం లింగి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండి తమ వంతుగా సహకరిస్తామన్నారు. పౌష్టిక ఆహారాలతో కూడిన జావాను ఇచ్చి తమ ఉదారతను చాటుకున్నారు. ఆశ్రమంలోని వృద్ధులను కలవడం, వారికి తన ద్వారా చిరు సహాయాన్ని అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై గణపతి, చిందం దేవిదాస్, అమీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నోట్‌బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన పూదరి చంద్రశేఖర్ తన తండ్రి కీ.శే పూదరి గంగన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా అంకోలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు కిషన్ పాల్గొన్నారు.

కందికుప్ప దగ్ధం



నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామం నల్ల విఠల్‌రెడ్డి రైతుకు చెందిన కంది కుప్ప బుధవారం రాత్రి దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు కౌలుకు తీసుకున్న చేనులో రెండెకరాల కంది పంట వేశాడు. పంట కోతకు రావడంతో పంట కోసి చేనులోనే కుప్పగా వేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో సుమారు పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే కందికుప్ప దగ్ధమైందని పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే ఇలా జరిగిందని ఆరోపించారు. సుమారు రూ.90 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మావల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంపై గురువారం మావల వైపు వెళుతుండగా పాత జాతీయ రహదారిపై కారు ఢీకొన్న ప్రమాదంలో విలాస్ తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా, ఘటన స్థలానికి చేరుకున్న 108 వాహన ఈఎంటి కిషన్, పైలెట్ ముజాఫర్‌లు క్షతగాత్రున్ని రిమ్స్‌కు తరలించారు.

పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని కిన్నెరపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణనికి గురువారం జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.7 లక్షలతో పాటు గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగురే కేశవ్, మాజీ సర్పంచ్ కానసింగ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కాంబ్లే విజయ్‌కుమార్, సచిన్, అప్పారావు, జీవరే రాజు, సూర్యావంశీ మాధవ్, ఉద్ధవ్ కొస్పె, తుకారాం, అంకుష్ పాల్గొన్నారు.

15న వాహనాల వేలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలకు ఈ నెల 15న ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ ఆవరణలో వేలం పాటను నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ హేమశ్రీ ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ప్రభుత్వంచే నిర్దేశించిన ధరావతు సొమ్మును చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

టీఏవీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉయిక సంజీవ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉయిక సంజీవ్ ఎన్నికయ్యారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుసం సచిన్ తెలిపారు. మండల అధ్యక్షులుగా పెందూర్ కృష్ణ, ఉపాధ్యక్షులుగా కోట్నాక్ చందు, చాకటి మాణిక్‌రావ్, ప్రచార కార్యదర్శిగా దుర్వ రాంచందర్, జంగు, నరేందర్, సాంస్కృతిక కార్యక్రమాల సభ్యులుగా ఆనంద్‌రావ్, శ్రీకాంత్, అశోక్‌లు ఈ నెల 5, 6న జిల్లా కేంద్రంలో జరిగిన టీఏవీఎస్ మహాసభలో ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ అన్నారు. గురువారం మండలంలోని యెందా గ్రామంలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని వైస్ ఎంపీపీ బాలాజీ, ఈజీఎస్ ఏపీఓ రజినీకాంత్‌లతో కలిసి ఆయన సందర్శించారు. వైద్య శిబిరం వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే వారిని పరీక్షించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రెండో సారి కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అంతకు ముందు ఉట్నూర్ నూతన డీఎస్పీగా నాగేందర్ పదవీ బాధ్యతలు స్వీకరించడంతో ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులతో డీఎస్పీని కలిశారు.

ఈద్గా నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ చించోలి(బి) గ్రామ శివారులో కొత్త ఈద్గా ప్రాంతంలో చేపట్టిన నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. విశాలమైన స్థలంలో, ప్రశాంత వాతావరణంలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు 12 ఎకరాల స్థలంలో మినార్ల ఏర్పాటు, ప్రహరీ గోడ, ప్రధాన ద్వారం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సుమారు 25 వేల మందికి పైగా సామూహిక ప్రార్థనలు చేసుకునేలా దీనిని నిర్మిస్తున్నామని తెలిపారు. మతాలు, రాజకీయలకు అతీతంగా అన్ని వర్గాల శ్రేయస్సే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రంజాన్ పండుగ వరకు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని అన్నారు. చైర్మెన్ వెంట కమిషనర్ అరిగెల సంపత్, డీఈ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు ఖాజా మాజిదొద్దిన్, సయ్యద్ జహీర్, ముజాయిద్ చౌస్, అన్వర్, సలిమ్, అబ్దుల్ మతిన్, తౌహిద్ ఉద్దీన్ రప్పు, పూదరి రాజేశ్వర్, లక్కాకుల నరహరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, జామ మసీదు మాజీ అధ్యక్షులు అజర్ హుస్సేన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ముషీర్ ఉద్దీన్, నాయకులు కలిమ్, ఫిర్దోస్, జాఫర్, కాంట్రాక్టర్ ఫులాన్, నాయకులు ఉన్నారు.

ప్రతిభకు ఆధారం విద్యాసాధనే



నవతెలంగాణ-నిర్మల్

ప్రతిభకు ఆధారం విద్యాసాధనేనని, విద్యార్థినులు ఒత్తిడిని అధిగమించాలని ప్రముఖ మనోవిజ్ఞాన నిపుణులు డాక్టర్ సురేష్ అన్నారు. జిల్లా కేంద్రం సోఫీనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో ఒత్తిడిని ఎలా అధిగమించాలి అనే అంశంపై ప్రేరణాత్మకమైన అవగాహన విద్యా సదస్సును గురువారం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న వేళలో ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థినులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ధ్యానం శ్రద్ధతో చేయాలన్నారు. ధ్యానంవల్ల మానసిక ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. ప్రతి విషయాన్నీ విద్యార్థినులు బట్టీ పట్టకుండా, చక్కగా చదువుకుని గుర్తు పెట్టుకోవాలన్నారు. బాగా చదవాలంటే ఆరోగ్యంగా ఉండాలని, సరియైన సమయానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. ఆకలిని జయించాలంటే సహజసిద్ధమైన పండ్లను తినాలని అన్నారు. ఏ విషయాన్ని చదివినా, శ్రద్ధ, పట్టుదల, సహనం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ధృఢసంకల్పం, మంచి మిత్రత్వం ఇలా సద్గుణాలను అలవరచుకోవాలన్నారు. ఇష్టంతో చదవాలని అన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యను సాధన చేయాలన్నారు. ఈ సూత్రాలన్నీ మన విజయానికి మార్గదర్శకాలుగా మిగులుతాయని అన్నారు. కార్యక్రమంలో అవేర్నెస్ ఆఫ్ స్ట్రీ మేనేజ్మెంట్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డా. గిరిబాబు, ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్, స్టాఫ్ నర్స్ శోభారాణి, ఉపన్యాసకులు బి వెంకట్, ఉపాధ్యాయులు మేరి మార్గరేట్, వనజ, జ్యోతి, సంతోష్, కల్పన, ఓదేలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



నేటి నుండి ప్రజాగోస..బీజేపీ భరోసా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో నేటి నుండి పదిరోజుల పాటు బీజేపీ కార్యకర్తలు తమ బూత్‌స్థాయి శక్తి కేంద్రాలలో కార్నర్ మీటింగ్ నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ మాట్లాడారు. ప్రజాగోస బీజేపీ భరోసా యాత్రకు రాష్ట్ర నాయకులూ అతిధులుగా పాల్గొననున్నారని తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు యేయే పథకాలను అందించింది. ఎన్ని నిధులు విడుదల చేసిందనే విషయాలను ప్రజలకు తెలిసేలా వారితో తెలపాలని అన్నారు. ఈ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రత్యామ్నాయం కేవలం బీజేపీ మాత్రమేనని ప్రజల్లో చర్చ నడుస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన మోసాలను శక్తి కేంద్రాలలో జరిగే కార్నర్ మీటింగ్‌ల ద్వారా సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 89, బోథ్ నియోజకవర్గంలో 22, ఖానాపూర్ నియోజకవర్గంలో ఇంద్రవెల్లి ఉట్నూర్‌లలో 38, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 24 శక్తి కేంద్రాలలో బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని సభలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా నాయకులు లాలా మున్న, లోక ప్రవీణ్ రెడ్డి, బొయర్ విజయ్, మయూర్ చంద్ర, దినేష్ మాటోలియా, రత్నాకర్ రెడ్డి, మెస్రం కృష్ణ, మహేందర్, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూములకు నీటి సౌకర్యం కల్పిస్తాం

నవతెలంగాణ-జైనథ్



దళిత బస్తీ భూములకు నీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ అన్నారు. గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని దళితబస్తీ భూములను పరిశీలించారు. నీటి సదుపాయం కల్పించేందుకు అక్కడి వనరులను పరిశీలించారు. లబ్ధిదారులు పండిస్తున్న పంటలను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఒక్క దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమిని పంపిణీ చేసిందని అన్నారు. వీటికి నీటిపారుదల సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని ప్రతి ఒక్క లబ్ధిదారులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. పంటలు పండించడం ద్వారా తమ జీవనాభివృద్ధి మెరుగుపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని అన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ ఉన్నారు.

దీక్ష భూమిని రాష్ట్ర పండుగగా గుర్తించాలి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని కొత్తపెల్లి దీక్ష గురువు శ్రీ సంత్ సేవాలాల్ దీక్ష భూమిని రాష్ట్ర పండుగగా గుర్తించాలని, ప్రతి సంవత్సరం జరిగే జనవరి 11న గురు కృప దినోత్సవంగా గుర్తించాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అసెంబ్లీ ఆవరణలో గురువారం గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందించారని మండల బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా రాష్ట్ర జాతరగా గురు కృపా దినోత్సవంగా గుర్తించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జెడ్పీచైర్మెన్ వెంట వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, నాయకులు కనక ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

కంటి వెలుగును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుచరిత రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాధవ్ రావులు అన్నారు. మండలంలోని అడెల్లి గ్రామంలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకొని కంటి చూపును మెరుగు పర్చుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, లక్ష్మీనారాయణ గౌడ్, రాజేశ్వరరావు, పిల్లి నాగయ్య, పురుషోత్తం రావు, మంగళ్ లక్ష్మణ్, గణేష్, వైద్య సిబ్బంది బుల్లోజి కిరణ్ పంచాయతీ సెక్రటరీ ప్రేమలతో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కంచరోని చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

నవతెలంగాణ-నిర్మల్

అభివృద్ధి పనుల్లో భాగంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కృషి, సహకారంతో కంచరోని చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. గురువారం చెరువు ప్రాంతాన్ని సందర్శించి చెరువులో ఉన్న గుర్రపు డెక్క, చెరువు ప్రాంతాన్ని శుభ్రం చేయు ప్రక్రియ పనుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. చెరువులో బోటింగ్ సిస్టమ్, చుట్టూరా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ వాసులకు ఆహ్లాదకరంగా, ఉల్లాసంగా ఉదయం, సాయంకాలం సమయంలో వీక్షించేలా ఉంటుందన్నారు. ఆహ్లాదకరంగా, పచ్చని మొక్కలు, కాంతి వెలుగులతో అన్ని హంగులతో పర్యాటక ప్రదేశంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చైర్మెన్ వెంట కమిషనర్ అరిగెల సంపత్, డీఈ నాగేశ్వరరావు, కౌన్సిలర్స్ లక్కాకుల నరహరి, తౌహిద్ ఉద్దీన్, రప్పు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసి డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో కూర్చునే సీట్లలో ఆర్టీసీ డ్రైవర్ చంద్రయ్యకు గురువారం ఒక సెల్ ఫోన్ దొరికింది. ఈ విషయాన్ని ఆర్టీసీ ఆన్‌లైన్ ఇన్‌చార్జ్ హుస్సేన్‌కు సమాచారం ఇచ్చారు. అదే సమయంలో హైదరాబాద్ గోల్కొండకు చెందిన ఇంతియాజ్ బస్టాండ్‌లో తన ఫోన్ కోసం గాలిస్తుండగా గమనించి, నిర్ధారించుకొని సదరు వ్యక్తికి సెల్‌ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బందికి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

అర్హులైన ప్రతి ఒక్కరికి కంటి పరీక్ష చేయాలని డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ, వైద్యులతో మాట్లాడుతూ ఇప్పటి వరుకు ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో ప్రతివాడాలో, ప్రతి ఇంటింటికి కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. వైద్యులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య అధికారి సాగర్, డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువధశాలను తరలించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ కాలనీలోని పశువధశాలను తరలించాలని, వెనుకబడిన కాలనీలలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయాలపై చర్యలు తీసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రెండో విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాయి ప్రసాద్, అర్జునీ సర్పంచ్ మడావి కన్ను అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని అర్జునీ గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటి వెలుగు వైద్య శిబిరానికి 18 ఏండ్లు పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకొని రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇఫాత్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన దళిత సంఘం నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఆదిలాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ రాజ్‌ని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాన్ని అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన తప్పకుండా ప్రతి సమస్యపై స్పందిస్తూ పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలియజేశారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌ని కలిసిన వారిలో మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చందల రాజన్న, నాయకులు గాలిపెల్లి నాగన్న, మల్యాల మనోజ్, నక్క రాందాస్, బండారి అశోక్, లింగంపల్లి ప్రసన్న కుమార్, బొజ్జ రాములు పాల్గొన్నారు.

9వ తరగతిలో ప్రవేశానికి 11న పరీక్ష

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బి చక్రపాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఐదు సీట్ల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 994 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వీరి కోసం కాగజ్‌నగర్‌లో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయంలో 528 మంది, సెయింట్ క్లారెట్ పాఠశాలలో 466 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఉదయం 11-15 నుండి 1-45 నిమిషాల వరకు పరీక్ష కొనసాగుతుందని, ఉదయం 10 గంటల వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్‌టికెట్‌తోనే విద్యార్థి పరీక్షకు హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు.

మతిస్థిమితం లేని మహిళకు చికిత్స

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన మహత్రె మమత కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండేది. రెండు నెలల క్రితం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్‌కు మమత భర్త ధర్మాజీ ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుండి హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రికి పంపించి చికిత్స చేయించి మానవత్వం చాటుకున్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొంది రెండు నెలల తర్వాత మమత ఇంటికి వచ్చింది. భార్య కోలుకొని ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావడంతో భర్త ధర్మాజీతో పాటు కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. సీఐ, ఎస్ఐకి కృతజ్ఞతలు తెలపగా గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

పోరాటాల ఫలితంగానే ఎండీఎం కార్మికుల వేతనాలు పెంపు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్



సిర్పూర్(టి)లో..

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలు, పెండింగ్ బిల్లులను, మినీ చార్జీలను పెంచాలని గతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగానే కార్మికుల వేతనాలు పెరిగాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట విజయోత్సవ సభను జిల్లా గౌరవధ్యక్షురాలు ఎర్ర కాంతమ్మ ఉపాధ్యక్షురాలు రూప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ అనేక పోరాటాలు చేసిందన్నారు. దాని ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలను రూ.వెయ్యి నుండి రూ.3వేలకు పెంచుతూ శనివారం జీవోను విడుదల చేసింది. జీవో విడుదల చేయడాన్ని సీఐటీయూ హర్షిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ జీవోను గతేడాది మార్చి 15న అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి అమలు చేస్తూ ఎరియర్స్‌తో సహా చెల్లించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలంటే మెనూ చార్జీలు పెంచాలని, కోడి గుడ్లను ప్రభుత్వమే ఉచితంగా అందజేయాలని, ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు లక్ష్మి, సక్కుబాయి, రేణుక, కమర్‌బేగం, గంగమ్మ, రజిత, పార్వతి, మీరాబాయి పాల్గొన్నారు.


బెజ్జూర్‌లో..

బెజ్జూర్ : మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచడాన్ని హర్షిస్తూ సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ కార్యాలయం ముందు విజయోత్సవ సభ నిర్వహించారు. మధ్యాహ్నభోజన కార్మికులు టపాకాయలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ అనేక పోరాటాలు చేసిందన్నారు. దాని ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలను రూ.వెయ్యి నుండి రూ.3వేలకు పెంచుతూ జీవో విడుదల చేసిందన్నారు. ఈ నెల 15న రాష్ట్ర కమిటీ సమావేశానికి హైదరాబాద్‌కు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గోరంట్ల వసంత్, గ్రామ పంచాయతీ, మధ్యాహ్నభోజన పథకం సంఘం నాయకులు ఆలం పూలబాయి, బాయక్క, శారద, సిడాం నిర్మల, గావుడె రమాదేవి, వరద పద్మ, బోరెం సాలక్క పాల్గొన్నారు.

విద్యార్థులు దేశం గర్వించేలా గొప్పగా ఎదగాలి

- విశ్రాంత ఆర్మీ కల్నల్, ఛాన్సలర్ వీఆర్‌కే ప్రసాద్



నవతెలంగాణ-మంచిర్యాల

పాఠశాల స్థాయిలోని విద్యార్థులు జీవిత లక్ష్యాలు ఏర్పర్చుకొని పట్టుదల, నిరంతర శ్రమ, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి దేశం గర్వించదగ్గ గొప్ప పౌరులుగా ఎదగాలని ఇండియన్ ఆర్మీ విశ్రాంత కల్నల్, ఇక్ఫాయ్ యూనివర్సిటీ ఛాన్సలర్ పాఠశాల పూర్వ విద్యార్థి డా. విఆర్‌కె ప్రసాద్ విద్యార్థులకు ఉద్బోధించారు. గురువారం ఆయన విద్యనభ్యసించిన జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించాడు. దేశభక్తి, పౌరుల బాధ్యత, విలువలు కలిగి ఉండాలని సూచించారు. తన జ్ఞాపకాలను గురువులు చెప్పిన పాఠాల్ని గుర్తు చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను భారత సైన్యంలో ఉన్నత అధికారిగా, ఛాన్సలర్‌గా ఎదగడానికి పాఠశాలే కారణమని గర్వంగా చెబుతున్నాని అన్నాడు. ఈ పాఠశాల తన జీవితానికి స్ఫూర్తి అన్నాడు. ఎన్నో పుస్తకాలు రాయటానికి తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల ఎంతో ప్రేరణ ఇచ్చిందని పేర్కొన్నారు. తన భావి జీవితమంతా దేశం కోసం, సమాజ శ్రేయస్సుకు కేటాయిస్తానన్నారు. తాను రాసిన 'జీవితం ఒక పాఠశాల' పుస్తకాన్ని పాఠశాలకు, కార్యక్రమ రూపకర్త గుండేటి యోగేశ్వర్‌కు బహూకరించారు. ఎంత గొప్పగా ఎదిగినా అమ్మానాన్నలను, గురువులను చదువుకున్న బడిని, సొంత ఊరును మర్చిపోకూడదని చెప్పారు. అనంతరం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆసూరి వేణుగోపాల్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు గుండేటి యోగేశ్వర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్, వర్మ, గోలి మనోహర్, నాగరాజు, చారి, స్వామి, రాజమౌళి, సునీతాదేవీ, రంగరాని, భాగ్యలక్ష్మి, నీల్‌కమల్ విద్యార్థులు స్వయంగా రంగు కాగితాలతో చేసిన పుష్పాలను అందించి అభిమానం వ్యక్తం చేశారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గొద్దు

- మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్



నవతెలంగాణ-జైపూర్

మహాశివరాత్రి సందర్భంగా వేలాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంచిర్యాల డిసిపి కేకన్ సుధీర్ రాంనాథ్ ఆదేశించారు. జైపూర్ ఏసిపి నరేందర్, ఎస్సై రామకృష్ణతో కలిసి గురువారం వేలాల గ్రామాన్ని సందర్శించారు. జాతర 18 నుండి 20 వరకు కొనసాగుతుండగా, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. వేలాల సమీపంలో గల గుట్టపై వెలసిన గట్టు మల్లన్న పరిసర ప్రాంతంతోపాటు గ్రామంలో గల ఆలయ పరిసరాలను పరిశీలించారు. గ్రామ సమీపంలో గల గోదావరి నది స్నాన ఘట్టాలను పరిశీలించారు. భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రమాదాలకు తావివ్వకుండా రాకపోకల ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. వేలాల మల్లన్న దర్శనార్థం వచ్చిన భక్తులు తిరిగి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునే విధంగా అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. జాతర సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వేలాల గ్రామానికి విచ్చేసిన డీసీపీని ప్రజాప్రతినిధులు శాలువాతో సన్మానించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పీఆర్టీయూ పోరాడుతోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. సంఘ 52వ ఆవిర్భావ దినోత్సవం గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా భవనంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్‌తో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు సామేల యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ సంఘం ముందుకు సాగుతోందన్నారు. 1971లో ప్రారంభమైన తమ సంఘంలో రాష్ట్రంలోనే అత్యధిక మంది సభ్యులు ఉన్నారని అన్నారు. ఉపాధ్యాయుల వేతన సవరణలో ఎప్పటికప్పుడు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. తమ సంఘం పోరాటం ఫలితంగానే ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతుల కలలు సాకారం అయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయులు తమ సొంత జిల్లాలకు బదిలీ చేసే విధంగా కృషి చేయడమే తమ లక్ష్యమని, ఆ విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. రానున్న నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ వేగవంతం చేసి కొత్త ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ సంఘంలో సీనియర్ సభ్యులు, రిటైర్ అయిన నాంపల్లి శంకర్, పుల్లూరి శంకర్, గోనుగుంట్ల పూర్ణచందర్‌రావు, తోట వినోద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సెడ్మెకె రాము, భిక్షపతి, ఉదయబాబు, వేణుగోపాల్‌రావు, ముంజంపల్లి రమేష్, చునార్కర్ చైతన్యకుమార్, గోవింద్, అజయ్‌కుమార్, సంతోష్, ఎనగంటి భిక్షపతి, శ్రావణ్‌కుమార్, అనిల్ కుమార్, సత్యనారాయణ, రతన్, భరత్‌కుమార్, లవన్‌కుమార్, శివ, కృష్ణమూర్తి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈజీఎస్‌పై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

ఎంపీడీవో ఎంఎ అలీం గురువారం కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు, పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈజీఎస్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు.

పాత పాఠశాలకు వేలంపాట

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పురాతన భవనం 15 ఏండ్ల నుండి ఉపయోగంలో లేనందున ఉన్నతాధికారుల ఆదేశాలతో పాఠశాల యాజమాన్య కమిటీ దాన్ని తొలగించడానికి తీర్మానించినట్టు ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్ తెలిపారు. పాత భవనానికి ఉన్న కిటికీలు, కర్రలు, తలుపులు, మట్టిని పూర్తిగా తొలగించి చదును చేయడానికి ఈ నెల 15న పాఠశాల ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్టు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.వెయ్యి ధరావత్తు సొమ్మును చెల్లించి వేలంపాటలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రీడాస్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పేయి అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఎంపీపీ కప్ సీజన్-2 ముగింపు వేడుకల్లో జెడ్పీటిసి అరిగెల నాగేశ్వరరావుతో కలిసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. క్రీడలు, జీవితంలో గెలుపోటములు సహజమని, గెలుపు వచ్చినప్పుడు పొంగిపోవడం, ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోవడం చేయకూడదన్నారు. రెండింటిని ఒకే విధంగా ఆస్వాదించి జీవితంలో ముందుకు సాగాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం విద్యార్థి దశ నుంచి అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడలతో పాటు చదువులో రాణించాలని సూచించారు. ఎంపీపీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, డిఇఓ అశోక్, ఎంపీడీఓ శశికళ, ప్రిన్సిపాల్ శ్రీనాథ్, ట్రస్మా అసోసియేషన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ చారి, ఎంఈఓ మణికుమార్, హెడ్మాస్టర్‌లు ఉదయ్ కుమార్, వెంకన్న, నాయకులు శరత్, ఎంపీవో ప్రసాద్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పాల్వాయి పురుషోత్తంరావు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను అందజేశారు. టోర్నమెంటు విజేతగా గుంట్లపేట జట్టుకు రూ.15 వేలు, రన్నరప్‌గా నిలిచిన ఎలుకపెల్లి జట్టుకు రూ.7వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని, యువత క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చపిడె సత్యనారాయణ, నాయకులు సిరిపురం భీమయ్య, గణపురం నాగేష్, శంకర్‌గౌడ్, కొలిపాక శ్రీనివాస్, వెంకన్న, చందు, కాంతారావు, సంతోష్, బాపూజీ, రవి, కమలాకర్ పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన కార్మికుల నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న నిరసన రెండో రోజు గురువారం కూడా కొనసాగింది. తమకు బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతూ నిరసన తెలుపుతున్న విషయం తెల్సిందే. మొదటి రోజు అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో రెండో రోజైన గురువారం కూడా నల్లబ్యాడ్జీలతో కార్మికులు విధులకు హాజరయ్యారు. అయినా అధికారుల నుండి స్పందన లేని పక్షంలో సోమవారం నుండి పోరాటాన్ని ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

భాషా సామర్థ్యాపై విద్యార్థులను తీర్చిదిద్దాలి



నవతెలంగాణ-కౌటాల

భాషా సామర్థ్యాలపై విద్యార్థులను తీర్చిదిద్దాలని మండల నోడల్ అధికారి గావుడె హన్మంతు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, బోదంపెల్లి, ఉప్పలగూడ పాఠశాలలను పరిశీలించి భాషా సామర్థ్యాలపై విద్యార్థులను చదివించి పరిశీలించారు. ఉపాధ్యాయులు మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు గణితంపై పట్టు సాధించడానికి సామర్థ్యాలే ఆధారమన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణ అలవరుచుకొనే విధంగా ప్రతిరోజు ప్రార్థన సమయంలో ఏకరూప దుస్తులు తప్పక వేసుకొనే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ఆయన వెంట సీఆర్‌పీ దేవన్న ఉన్నారు.

వాగుపై బ్రిడి నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట, మామిడిగూడెం గ్రామాల మధ్య ఉన్న కాసిపేట వాగుపై సీపీఎంజీఎస్ పథకం కింద రూ.3.20 కోట్లతో మంజూరైన బ్రిడ్జి నిర్మాణ పనులను జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని, తెలంగాణ రాష్ట్రంలో అన్ని సదుపాయాలు గ్రామీణ స్థాయిలో కూడా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లతో పాటు గ్రామీణ రహదార్లు కూడా పూర్తి అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, సహకార చైర్మన్ నీలా, సర్పంచులు దరావత్ దేవి, ఆడే బాదు, సంపత్, ఎంపీటీసీలు అక్కెపల్లి లక్ష్మీ, రాంచందర్, ఉప సర్పంచులు పిట్టల సుమన్, బోయిని తిరుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి, మోటూరి వేణు, అగ్గి సత్తయ్య పాల్గొన్నారు.

ఆర్‌కె-1ఏ గనిని కొనసాగించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్‌కె-1ఏ గనిని మూసివేయకుండా కొనసాగించాలని సింగరేణి యాజమాన్యాన్ని ఏఐటీయూసీ అధ్యక్షులు ఎం.డి అక్బర్ అలీ డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌కె1ఏ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు తెలుసుకుకున్నారు. ఈ సందర్భంగా ఎండి అక్బర్ అలీ మాట్లాడుతూ ఆర్‌కె1ఏ గనిలో ఇంకా పది సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని, గనిని కొనసాగించాలని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మూసివేయాల్సి వస్తే కార్మికులు ఏఏ డిజిగ్నేషన్‌లలో యాక్టింగ్ చేస్తున్నారో వారందరికీ ఆయా డిజిగ్నేషన్‌ల ప్రమోషన్లు ఇచ్చి బదిలీ చేయాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షులు ఇప్పకాయల లింగయ్య, ఫిట్ సెక్రటరీ సురమళ్ల వినయ్ కుమార్, ఫిట్ కమిటీ సభ్యులు సుంకరి గట్టయ్య, మెడం బాల్కోటిరెడ్డి, ఏలూరి శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యకర్తలు కొల బనాయ్య, బండి కనకయ్య, కాటేపెల్లి రాజశేఖర్, మొగిలి, సమీర్, అభినవ్ వ్యాస్, కైత రాయమల్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్టీయూ పోరాటం

నవతెలంగాణ-జన్నారం



ఉపాధ్యాయుల సమస్యలపై తెలంగాణ పీఆర్టీయూ నిరంతర పోరాటాలు చేస్తోందని మండల అధ్యక్షులు కట్టా రాజమౌళి అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సంఘం భవనం ఆవరణలో ఆ యూనియన్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

డీఈఓ పాఠశాలల తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో గల తెలుగు, ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలను డీఈఓ ప్రణీత గురువారం సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలిమెట్టు లో భాగంగా చదవడం, రాయడంతో పాటు గణితంలో చతుర్వేద ప్రక్రియలు విద్యార్థులు ఎంత వరకు నేర్చుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠశాలను శ్రద్ధగా వినాలని అన్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ఆయా సబ్జెక్టులకు సంబంధించిన నోట్ బుక్స్‌ను పరిశీలించారు.

ప్రభుత్వ భూములపై అధికారుల నిర్లక్ష్యం..!

- ఆక్రమించేందుకు రియల్టర్ల ఎత్తుగడలు
- పొత్తు కుదరకుంటే గొడవలు

నవతెలంగాణ-తాండూర్



ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని, దీంతో ఆ భూములను ఆక్రమించేందుకు రియల్టర్లు వ్యూహాత్మకమైన ఎత్తుగడలు వేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేపట్టి అమ్మకాలు కొనసాగిస్తున్నట్టు, అన్నీ తెలిసినా రెవెన్యూ పంచాయతీరాజ్, ఇరిగేషన్, రైల్వే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పరిపాలన సౌలభ్యం కోసం రెవెన్యూ శాఖ ఇరిగేషన్, పంచాయతీరాజ్, రైల్వే, ఫారెస్ట్ విద్యాశాఖలకు భూములను కేటాయించి, భూమి వివరాలను పూర్తి ఆధారాలతో కాస్రా పహానీలలో వివరాలను పొందుపరిచినట్టు పేర్కొన్నారు. కొన్ని శాఖలకు హక్కు పత్రాలు లేకపోవడంతో రియల్టర్లు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. అడ్డు వచ్చిన అధికారులను బెదిరింపులకు పాల్పడుతున్నారు. మండలంలోని సర్వే నెం. 662, 669, 22, 23, 750,లో వివిధ శాఖలకు చెందిన విలువైన ప్రభుత్వ భూములు ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో ఫోర్‌వే రహదారి నిర్మాణం జరగడంతో భూముల ధరలకు అమాంతం పెరిగిపోయాయి. దానికి తోడు పారిశ్రామిక వ్యవసాయ రంగాల పరంగా అభివృద్ధిలో పురోగతి సాధిస్తున్న తాండూరు మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతుండటంతో, భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో ఎలాగైనా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను వెంచర్లుగా ఏర్పాటు చేసి అక్రమంగా కోట్లకు పడిగలేత్తుతున్నారు. ప్రభుత్వ భూముల్లో పేదల పేరిట గుడిసెలు వేసేస్తున్నారు. కుల సంఘాల విగ్రహాలను కొత్త దేవుళ్లను సృష్టించి అధికారాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. మత సంస్థలు స్వచ్ఛంద సంస్థల పేరిట ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, భూమిని దక్కించుకునేందుకు వివిధ ప్రయత్నాలు చేసి అధికారులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఫోర్‌వే నిర్మాణంలో భాగంగా భూమిని కోల్పోయిన వారి పట్టాలను తీసుకొని తిరిగి మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు చర్చ కొసాగుతుంది. రెవెన్యూ అధికారులు బృహత్ పల్లె పకృతి వనాలకు క్రీడా మైదానాల కేటాయించిన భూమిని సైతం వివాదాలు సృష్టించి స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి స్థలాల పేరిట ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, తిరిగి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. భూమి ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని గ్రహించిన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ప్రభుత్వ భూములు ఆక్రమణ నేపథ్యంలో కొంత విలువైన భూమిని రెవెన్యూ అధికారులు క్రీడామైదానాలకు ఆట స్థలాలకు కేటాయించినప్పటికీ వివాదాలు సృష్టించి పనులు జరగకుండా అడ్డుకుంటున్నారు. విషయం పోలీసులకు తెలిసినప్పటికీ సులువుగా తీసుకోవడం వెనుక రాజకీయ హస్తం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కిష్టంపేట శివారు సర్వే నెంబరు 23 లో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కిష్టంపేట బృహత్‌పల్లె ప్రకృతి వనానికి కేటాయించినప్పటికీ కొందరు నాయకులు వివాదాలు సృష్టించి పనులు జరగకుండా అడ్డుకుంటున్నారు తాండూరు శివారులోని 669 సర్వే నెంబర్లు ఎకరం భూమిని రెవెన్యూ అధికారులు క్రీడామైదానానికి కేటాయించగా, కేటాయించిన ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే పేదల పేరిట గుడిసెలు నిలవడం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారుల హస్తం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములు చేతులు మారుతుంటే వివిధ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ శాఖ వివిధ శాఖలకు కేటాయించిన భూములను ఆయా శాఖల అధికారులు రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ప్రభుత్వ భూముల అక్రమణకు గురికాకుండా జిల్లా స్థాయి రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వివిధ శాఖల అధికారులు సింగరేణి యాజమాన్యం మాదిరిగా వారికి కేటాయించిన భూములను పర్యవేక్షిస్తూ రాబోయే రోజుల్లో పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు తమ వంతు బాధ్యతగా విధులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

- తహసీల్దార్ కవిత



ప్రభుత్వ భూములు అక్రమణకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. అక్రమ కట్టడాల వ్యవహారం పంచాయతీ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. రెవెన్యూ శాఖ వివిధ శాఖల కేటాయించిన భూమిని కాపాడుకునే బాధ్యత ఆయా శాఖల అధికారులు నిర్వర్తించాలి. గతంలో ఇరిగేషన్, రైల్వే, ఫారెస్ట్ శాఖల కేటాయించిన భూముల్లో హద్దురాళ్ల ఏర్పాటు చేయడం జరిగింది. ఆయా శాఖల అధికారులు భూముల చుట్టూ కంచెను నిర్మించుకోవాలి. సర్వే నెంబర్ 612లో అక్రమ కట్టడాల వ్యవహారం ఇంతకు వరకు మా దృష్టికి రాలేదు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత కట్టుదిట్టంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని ఈవీఎం గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జనవరి నెలలో ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు లోబడి ఈసీఐఎల్ కంపెనీ హైదరాబాద్ నుండి జిల్లాకు వచ్చిన 1,313 బ్యాలెట్ యూనిట్లు, 1 వేయి 25 కంట్రోల్ యూనిట్లు, ఎం-3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను గోదాములో భద్రపర్చడం జరిగిందని, సంబంధిత శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నూతన ఆస్పత్రి భవనానికి స్థలం పరిశీలన

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో గురువారం నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్టు అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్ నాయక్ తెలిపారు. 15వ ఆర్థిక నిధుల నుండి రూ.1.56 కోట్లు భవన నిర్మాణానికి మంజూరైనట్టు పేర్కొన్నారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ తుకారాం, వైద్యసిబ్బంది ఉన్నారు.

రిటైర్డ్ కార్మికుల డబ్బులు ఖాతాలో జమ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

రిటైర్డ్ కార్మికులకు డబ్బులు చెల్లించడంలో సింగరేణి యాజమాన్యం జాప్యం చేస్తోందని, తక్షణమే వారికి చెల్లించాల్సిన డబ్బులను ఖాతాలో జమ చేయాలని హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జీవన్ జోయల్, కార్యదర్శి తిప్పారావు సారయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్డ్ అయిన కార్మికులు దాదాపు 1000 మందికిపైగా ఉంటారని, వారందరికీ 6లోపు డబ్బులు జమ చేస్తామని చెప్పి ఇప్పటివరకు జమ చేయలేదని ఆరోపించారు. సకాలంలో డబ్బులు రాకపోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత రూ.5వేలు జరిమానా

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణవాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీఎస్18బి 4785 నెంబర్ గల ట్రాక్టర్‌ను గురువారం రెవెన్యూ సిబ్బంది పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ సంతోష్ రెడ్డి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ కు రూ. 5వేలు జరిమానా విధించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ లోన్ యూనిట్ పెంచాలి



నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ పేద ప్రజల అభివృద్ధికి అందిస్తున్న మైనార్టీ కార్పొరేషన్ లోన్ యూనిట్ పెంచాలని ఎంపీడీఓ కార్యాలయంలో మైనార్టీ నాయకులు గురువారం ఎంపీడీఓ కావల రమేష్‌కు వినతిపత్రం అందించారు. మండలానికి మంజూరైన 3 యూనిట్ నుండి కనీసం 25 యూనిట్ వరకు పెంచాలని కోరారు. గురువారం నిర్వహించే లక్కీ డ్రాను వాయిదా వేశారు. వినతిపత్రం అందించిన వారిలో మైనార్టీ నాయకులు కరీం ఖాన్, సుల్తాన్ ఖాన్, షేక్ జబ్బార్, షారుక్, యాసిన్, శాకిబ్ ఖాన్, యూసుఫ్ ఖాన్, ఖదీర్, సోహెల్, హసన్, మొహమ్మద్, షబ్బీర్ ఉన్నారు.

తాగుడుకు బానిసై వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఇచ్చోడ

తాగుడుకు బానిసై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బజార్‌హత్నూర్ మండలంలోని లక్ష్మణ్ నాయక్ తండకు చెందిన కాత్లే చంద్రబాన్(47) తాగుడుకు బానిసై గత ఆరు నెలల కింద ఇంటి నుంచి వెళ్లిపోయి ఇచ్చోడ మండల కేంద్రంలో ఎలాంటి పనిచేయకుండా తిరుగుతూ, తిండి, నీళ్ల అందుబాటులో లేక ఆనారోగ్యానికి గురై మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతుడి భార్య దేవుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నీరేష్ తెలిపారు.

జైనూర్ వ్యవసాయ మార్కెట్‌కు పాలకవర్గం ఏర్పాటయ్యేనా..?

- చైర్మన్ పదవి కోసం ఆశావాహుల ఎదురుచూపు

నవతెలంగాణ-జైనూర్



జైనూర్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ఏర్పాటుపై ఉత్కంఠ నెలకొంది. చాలా కాలంగా పాలకవర్గం ఏర్పాటు కాకపోవడంతో రైతు సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కోసం ఆశావాహులు చాలా మంది ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఏ నిర్ణయమూ తీసుకోవడం లేదు. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, ఉట్నూర్ మండలాలకు ఏకైక మార్కెట్ కమిటీ జైనూర్‌లో ఉంది. నాలుగు మండలాలకు చెందిన రైతులకు ఏదైన సమస్య వస్తే వ్యవసాయ కార్యాలయం లేదా మార్కెట్ కమిటీ ద్వారా పర్యవేక్షిస్తారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పెసా చట్టం ద్వారా ఈ మండలాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేవలం గిరిజనులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే జెడ్పీ చైర్‌పర్సన్ ఇచ్చిన నివేదిక ప్రకారమే ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడుతాయి. 2014 నుండి రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన కొనసాగుతోంది. పాలకవర్గం గడువు ముగిసి నాలుగు నెలలు పూర్తయినా మార్కెట్ చైర్మన్ పదవి ఎవరికి కేటాయిస్తారనేది ప్రశ్నార్థకంగానే ఉంది. సిర్పూర్(యు) మండలానికి చెందిన ఆత్రం భగవంత్‌రావు రెండేండ్ల వరకు చైర్మెన్‌గా కొనసాగారు. నవంబర్ 25తో 16 మంది డైరెక్టర్లు, చైర్మన్ పదవి కాలం పూర్తికావడంతో వారికి వీడ్కోలు పలికారు. నాలుగు నెలలు పూర్తికావస్తున్నా ప్రధానమైన మండలాలైన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, ఉట్నూర్ ప్రాంతాల ప్రజలకు కేంద్ర బిందువుగా జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉంది. ఈ మార్కెట్ కమిటీ పరిధిలో వంద శాతం ఏజెన్సీ ప్రాంతం ఉండడంతో గిరిజన ఆశావాహులు పదవి కోసం ఎదురుచూస్తున్నారు. మార్కెట్‌కు సుమారు రూ.65 కోట్ల ఆదాయం ఉన్నా పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం జాప్యం చేస్తుండడం చర్చకు దారి తీస్తోంది.

చైర్మన్ పదవి కోసం ఆశావాహుల ఎదురుచూపు

జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం గడువు ముగిసి నాలుగు నెలలు కావస్తుంది. చైర్మన్ రేసులో పలువురు బీఆర్ఎస్ నాయకులు పోటీ పడుతున్నారు. గతంలో సిర్పూర్(యు) మండలానికి చైర్మన్ పదవి కట్టబెట్టి 16 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. ఈ మార్కెట్ కమిటీకి రెండు నియోజకవర్గాలు ఉండడంతో ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ నుండి వైస్ చైర్మన్‌కు అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం చైర్మెన్ పదవి కోసం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, ఉట్నూర్ నుండి పోటీ పడుతున్నారు. చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. సుమారు రూ.3కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖకు నూతన భవనంతో పాటు మార్కెట్ కమిటీకి ఆదాయం పెంచేందుకు నూతనంగా 12గదులను మంజూరు చేసింది. ఐదు మండలాల నుండి పంటలు పెద్ద ఎత్తున వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వస్తాయి. పత్తి సీజన్ ప్రధానమైన సీజన్‌గా ఉంటుంది. నవంబర్ నుండి రైతులు పత్తి పంటను మార్కెట్‌కు తీసుకొచ్చే సమయంలోనే పాలకవర్గం గడువు ముగిసింది. దీంతో పత్తి రైతు బాధలు ఎవరికీ పట్టలేదని పలువురు పేర్కొంటున్నారు.

నూతన నిబంధనల ప్రకారం 18 మందికి అవకాశం

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కాలాన్ని నూతన చటం ప్రకారం ఈ ఏడాది నుండి రెండేండ్ల వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా నూతన కమిటీలో 18మంది డైరెక్టర్లు చైర్మన్‌ను ఎన్నుకుంటారు. చైర్మెన్‌గా అవకాశం ఎవరికి దక్కుతుందోనని బీఆర్ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. ఇంద్రవెల్లి, ఇచ్చోడ మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకాలు జరిగాయి. కానీ జైనూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం గడువు ముగిసి నాలుగు నెలలైనా భర్తీ చేయకపోవడంతో ఆశావాహులు, రైతుల్లో అసంతృప్తి నెలకొంటోంది.

సంఘటితంగా ఉంటే సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంఘటితంగా ఉంటే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో టీఎన్జీవో ఫోరం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. జిల్లా కమిటీ ఇచ్చే పిలుపు మేరకు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కమిటీ సభ్యులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి సిడాం పోచయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు కరుణశ్రీ, పబ్లిసిటీ సెక్రటరీ భోగ మధుకర్, ఎడ్యుకేషన్ ఫోరం అధ్యక్షుడు అంకుష్, ఈసీ మెంబర్ రిజ్వాన్ పాల్గొన్నారు.

ఫోరం అధ్యక్షురాలిగా పి.కౌసల్య ఏకగ్రీవం

టీఎన్జీవో ఫోరం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఫోరం అధ్యక్షులుగా పి.కౌసల్య ఎన్నికయ్యారు. సెక్రెటరీగా తిరుపతమ్మ, ట్రెజరర్‌గా ఎస్.మల్లేష్, ఉపాధ్యక్షుడుగా సలీం, అసోసియేట్ అధ్యక్షుడుగా కె.అర్జున్, జాయింట్ సెక్రటరీగా పెంటుబాయి, ఈసీ మెంబర్లుగా లక్ష్మి, విజయ, కళావతి, అనంతరావు, ప్రభాకర్, అనసూయ ఎన్నికయ్యారు.

మరుగుదొడ్లు లేక అవస్థలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వ్యక్తిగత మరుగుదొడ్లు లేక ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. గురువారం కేఆర్‌కే కాలనీలో పర్యటించిన ఆమె కాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు. వ్యక్తి గత మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, కిలోమీటర్ దూరం బయటకి వెళ్లాలని, మురికి కాలువలు రోడ్లు లేక కష్టాలు పడుతున్నామని కాలనీవాసులు ఆమెకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తి గత మరుగుదొడ్లు కట్టించి ఇవ్వాలని అధికారులను, ఎమ్మెల్యేను కాలనీ వాసులు ఎన్ని సార్లు కలిసి సమస్యను విన్నవించిన ఫలితం లేదని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మెన్ పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. పదిహేను రోజుల్లోగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, లేకపోతే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి పట్టణంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని అలాగే తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జాం గ్రామంలో వివాహిత మహిళ అదృశ్యమైనట్టు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాం గ్రామానికి చెందిన జంగం యమున(30)కు కామరెడ్డి జిల్లాలోని బ్రాహ్మణపల్లికి చెందిన అనిల్ అనే వ్యక్తితో ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో నాలుగు నెలల నుండి కూతురు, కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈనెల 7న యమున తండ్రి అల్లమయ్య పని నిమిత్తం బయటకు వెళ్లాడు. వచ్చి చూసేసరికి కూతురు కనిపించకపోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే మొబైల్ 8328521213 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని వెల్లడించారు.

ఆపదలో అండగా దివ్యశ్రీ ఫౌండేషన్

నవతెలంగాణ-నార్నూర్




ఎవరికి ఏ ఆపద వచ్చిన ఆదుకునేందుకు దివ్యశ్రీ ఫౌండేషన్ ముందుకు ఉంటుందని ఫౌండేషన్ చైర్మెన్ దారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని పరస్‌వాడ గ్రామానికి చెందిన నైతం యశ్వంత్ రావ్ కొన్ని సంవత్సరాల నుండి కడపునొప్పితో బాధ పడుతున్నట్టు తెలుపడంతో ఆయనకు డిసెంబర్ 18న దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదిలాబాద్ నుండి మహారాష్ట్రలోని వర్ధ ఆస్పత్రికి తరలించి రూ.48వేలు సాయం అందించి, ఆపరేషన్ పూర్తి చికిత్స చేయించారు. ఇంటికి వచ్చిన నైతం యశ్వంత్‌కు గురువారం పరస్‌వాడ గ్రామంలో దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ పరామర్శించారు. సాయం చేసిన ప్రవీణ్ నాయక్‌కు ఫౌండేషన్ సభ్యులకు, కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు తొలగించిన ఆర్‌అండ్‌బీ అధికారులు

నవతెలంగాణ-జన్నారం

జన్నారం నుంచి తపాలాపూర్ మధ్య ఎలాంటి సూచిక బోర్డులు లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గర్భిణీ బుధవారం కింద పడిపోయి తీవ్రంగా గాయపడింది. ఈ విషయం నవతెలంగాణలో ప్రచురితం కావడంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం ఉదయం స్పీడ్ బ్రేకర్‌లను పూర్తిగా తొలగించారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే ముందు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-తలమడుగు

బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్ మాతృమూర్తి తోట అమృతబాయి అనారోగ్యంతో బాదపడుతూ ఆకస్మాత్తుగా గురువారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ మార్కెట్ చైర్మెన్ అల్లూరి సంజీవరెడ్డి, యాసం నర్సింగ్‌రావ్, హౌసింగ్ బోర్డ్ మున్సిపల్ కౌన్సిలర్ అంబకంటి అశోక్, మండల కాంగ్రెస్ కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్ ఉన్నారు.

జాతీయ సదస్సుకు ప్రధానోపాధ్యాయుని ఎంపిక

నవతెలంగాణ-తాంసి

జాతీయ విద్యా ప్రణాళిక పరిపాలన సంస్థ న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ సదస్సుకు భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న బెదోడ్కర్ సంతోష్ కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 15, 16న జరిగే సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుండి నలుగురు ఎంపిక కాగా భీంపూర్ మండలంలోని నిపాని పాఠశాల నుండి ఎంపిక కావడంతో గ్రామస్తులతో పాటు మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

శుభకార్యాలకు అద్దె బస్సులపై ప్రత్యేక రాయితీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండ్లిల సీజన్ నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ శుభకార్యాలకు అద్దె బస్సులపై ప్రత్యేక రాయితీని కల్పిస్తోందని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ కే.జానీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల బస్ సర్వీస్లపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది జూన్ 30 వరకు అద్దె బస్సులపై 10 శాతం రాయితీ అమల్లో ఉంటుందని తెలిపారు. అద్దె బస్సుల బుకింగ్ కోసం తమ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ టీఎస్ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి వివరాలకు స్థానిక డిపో మేనేజర్‌ను సంప్రదించాలని అన్నారు. శుభకార్యాలు, పెండ్లిలకు తమ అద్దె బస్సులకు వినియోగించుకుని టీఎస్ఆర్టీసీని ప్రోత్సహించాలని కోరారు. పెండ్లిల సీజన్ నేపథ్యంలో డిమాండ్‌ను బట్టి అద్దె బస్సులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.